www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 11 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్



విరమణ వయస్సు పెంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప కార్పొరేషన్లో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులను వయస్సు రీత్యా తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డు పాలు అవుతున్నాయని, విరమణ వయస్సు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులకు 62 సంవత్సరాలు పెట్టి, రూ. లక్షల జీతం ఇస్తూ ఉన్నారని పేర్కొన్నారు. వారితో సమానంగా పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులకు రూ.15వేలు వేతనం ఇస్తూ 60 సంవత్సరాలకే పరిమితి చేయడం దారుణమని చెప్పారు. పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, కార్పొరేషన్ వరకు ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వడానికి ఆర్థిక శాఖలో పెండింగ్ జీవో నంబర్ 36 ను ప్రభుత్వం విడుదల చేయాలని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు




రారండోయ్.. వేడుక చూద్దాం

నేడు సీతారాముల కల్యాణం

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట విద్యుత్ దీపాలతో, ఆకాశమంత పందిళ్లతో కళకళలాడుతోంది. ఇప్పటికే రాష్ట్ర నలుమూల నుంచి స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు యాత్రికులు ఒంటిమిట్ట చేరుకున్నారు. కళ్యాణశోభను ఒంటిమిట్ట సంతరించుకుంది. రామనామ స్మరణతో ఏకశిలానగరం మారుమ్రోగుతోంది. వివిపిల రాక, పోలీసుల బందోబస్తుతో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు నూతన శోభను సంతరించుకుంది. కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానుండటంతో పోలీసులు అడుగడుగునా మోహరించి కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టారు.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ఒంటిమిట్ట

ఏకశిలానగరిలో శుక్రవారం రాత్రి నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒంటిమిట్ట కోదండ రామాలయం విద్యుత్ దీపపు ధగధగలతో దేదిప్యమానంగా ముస్తాబైంది. నబూతో నభవిష్యతి అనేరీతిలో విద్యుత్ కాంతుల మధ్య ఆకాశమంత చలువపందిళ్లతో కళకళ లాడుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి జగదబిరాముని కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు, యాత్రికులు, సేవకులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. జగదభిరాముని ఆలయంలోని దత్తమండపం, ధ్వజస్తంభం, కల్యాణవేదిక విద్యుత్ కాంతులతో కల్యాణశోభను సంతరించుకుంది. ప్రభుత్వం తరుపున కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో రానుండడంతో నూతనశోభ చోటు చేసుకుంది. పలువురు మంత్రులు, విఐపిలు రానున్నారు. సుమారు రెండు వేల మంది పోలీసులు అడుగడుగునా మోహరించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజునాటికి కల్యాణ ఘడియలు సమీపించడంతో పలువురు భక్తులు, పర్యాటకులు, యాత్రికులు, సేవకులు కల్యా ణోత్సవాన్ని తిలకించేందుకు ఎదురు చూస్తున్నారు. ఒంటిమిట్ట గ్రామ శివారులోని కల్యాణ వేదిక, దత్తమండపం, కోదండ రామాలయం విద్యుత్ కాంతులతో శోభాయమానంగా ప్రకాశిస్తోంది. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అడుగడుగునా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గతానికి భిన్నంగా భారీఎత్తున ప్రత్యేక బారీకేడ్లను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని జయప్రదం చేయడానికి పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లను చేయడం గమనార్హం. శుక్రవారం రాత్రి చంద్రుని వెన్నెల్లో జరిగే కల్యాణోత్సవానికి పలువురు దాతలు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. సీతారాముల కల్యాణం అనంతరం టిటిడి యంత్రాంగం లక్షలాది మందికి భోజన సదుపాయాలను ఏర్పాటు చేసింది.

కల్యాణానికి కోటి తలంబ్రాలు సమర్పణ

ఒంటిమిట్టలో శుక్రవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పా రావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలం బ్రాలను గురువారం సమర్పించారు. 120 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద సూపరింటెండెంట్ హనుమంతయ్య, అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు. ఈ తలంబ్రాల కోసం మూడు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తి భావంతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 14 ఏళ్లగా భద్రాద్రి రామునికి, మూడు ఏళ్లగా అయోధ్యకి, 8 ఏళ్లగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.



కోటి తలంబ్రాలకు పూజ నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం : చైర్మన్

ఒంటిమిట్టలో శుక్రవారం సాయంత్రం 6:30 నుండి రాత్రి 8:30 గంటల మధ్య శ్రీ సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు చెప్పారు. చైర్మన్ టిటిడి, జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఒంటిమిట్ట ఆలయ ప్రాంగణంలోని పరిపాన భవనం మీటింగ్ హాల్లో చైర్మన్, ఇఒ జె.శ్యామలరావు, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెఇఒ వీరబ్రహ్మం, జెసి అదితి సింగ్, ఎస్పి ఇ.జి.అశోక్ కుమార్, సివిఎస్ఒ హర్షవర్ధన్ రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏకశిలానగరంలో శుక్రవారం జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణాన్ని టిటిడి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. సీతారాముల కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమం నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 147 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్యాలరీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారామెడికల్, టిటిడి ఉద్యోగులు, పోలీసు, శ్రీవారి సేవకులు ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టామన్నారు.

గరుడ వాహనంపై సీతాపతి

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహన సేవ 9 గంటల వరకు జరగనుంది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శిం చుకు న్నారు. ఉదయం మోహినీ అలం కారంలో రాములవారు జగన్మోహ నాకా రుడిగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు స్వామివారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలా టాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శిం చుకున్నారు. వాహన సేవలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



జగన్ను విమర్శించే స్థాయి తిరుమలేష్కు లేదు

ప్రజాశక్తి - కడప : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్రెడ్డిని నోటికి వచ్చినట్లు విమర్శించే స్థాయి టిఎన్ఎస్ కడప జిల్లా అధ్యక్షులు తిరుమలేష్కు లేదని వైసిపి యువజన విభాగం కడప జిల్లా అధ్యక్షులు దేవి రెడ్డి ఆదిత్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సాయి దత్త అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విమర్శలు చేసే ముందు ఆలోచించాలన్నారు. టిడిపిలోకి చేరిన తరువాత లక్షల రూపాయలను తిరుమలేష్ దండుకుంటున్నారని విమర్శించారు. కళాశాలలు, యూనివర్శిటీల వద్ద అధికారులను బెదిరించి వసూళ్లకు పాల్పొడతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతో రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. మరోసారి జగన్పై విమర్శళు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ తీరు బాధాకరం అన్నారు.

విమర్శలు సిగ్గుచేటు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రంలోని పోలీసులను బట్టలు ఊడదీసి నిలబెడతాను అని వైసిపి అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ పేర్కొన్నారు. గురువారం ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు, విద్యార్థి విభాగం అధ్యక్షులు తనపై వైసిపి ఇష్టానుసారంగా చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను నిరాధారమని పేర్కొన్నారు. అందుకు అతనిపై పరువు నష్టం దావా కేసు వేస్తున్నానని తెలిపారు. వ్యక్తిగత విమర్శలు చేసే ముందు మీ వ్యక్తిగతం గురించి కూడా ఆలోచించాలన్నారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్ సింహా, ఫరీద్, అరవింద్ పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న బిజెపి : డిసిసి

ప్రజాశక్తి - కడప : నకిలీ దేశభక్తితో బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రజలను మోసగిస్తున్నాయని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి పేర్కొన్నారు. న్యాయ మార్గమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. గురువారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అహ్మదాబాద్లో ముగిసిన 86వ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పలు కీలక తీర్మానాలను ప్రకటించింది అన్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణపై కాంగ్రెస్ పార్టీ యొక్క నిబద్ధతను స్పష్టంగా వెల్లడించిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, ఇది మత స్వేచ్ఛపై దాడి అన్నారు. ముస్లింలు మరియు క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలను భయభ్రాంతుల్లోకి నెట్టడం పెద్ద నేరమని విమర్శించారు. సమావేశంలో కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, నగర అధ్యక్షులు అఫ్జల్ఖాన్, సయ్యద్ గౌస్పీర్ ,అబ్దుల్ సత్తార్, మైనుద్దీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి : ఆవాజ్

ప్రజాశక్తి- కడప అర్బన్

రాజ్యాంగ వ్యతిరేకమైన వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఆవాజ్ కార్యాలయంలో ఆవాజ్ కమిటీ జిల్లా విస్తృత సమావేశం పి.చాంద్బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తనకున్న మందబలంతో రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలను తుంగలో తొక్కి భారతదేశ భిన్నత్వంలో ఏకత్వం అనే సందేశాన్ని ప్రపంచానికి చాటిన ప్రజల మధ్య మత ఉన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ రాజ్యాంగం మైనార్టీలకు కల్పించిన హక్కులను హరిస్తుందని విమర్శించారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లిం మైనార్టీ సమాజానికి మేలు, కాపాడబడుతాయని ముస్లింల అభివృద్ధి చెందుతారని బిజెపి ప్రభుత్వం చెప్పడం ఆ సామాజిక తరగతిని మోసగించడమే అన్నారు. నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలను చేయడమే తప్ప మెరుగుపరిచింది ఎక్కడని ప్రశ్నించారు. అలాల్, హిజాబ్, అజాం, ఆహారం, త్రిపుల్ తలాక్ పేరుతో ముస్లిం మైనార్టీలపై భౌతిక దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ నిర్వహణలో లోపాలు ఉంటే సరిచేసి వారికి స్వాధీనపరిచి ప్రజాతంత్ర పద్ధతిలో బోర్డును నిర్వహించవలసిన వారు రాజకీయ పార్టీల వేదికల వక్ఫ్ బోర్డు ఉందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.అన్వర్ బాష, ఎస్. అబ్దుల్ సత్తార్, ఎస్.షరీఫ్, ఎస్.ఖాదర్ బాషా, ఎస్.మెహబూబ్ బాష, ఆవాజ్ జిల్లా మహిళా నాయకులు గౌసియా, జమీల, బిబి, జిల్లా కమిటీ సభ్యులు బాష వల్లి, జహంగీర్, జాఫర్, అబ్దుల్ రెహమాన్, ఖలీల్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత సర్కులర్ అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిఎస్ ఆర్టిసిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత సర్కులర్ అమలు చేయాలని ఎన్ఎంయుఎ కడప రీజియన్ అధ్యక్షులు నాగముని, డిపో కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్టిసి కడప డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రెండు రోజులపాటు గేట్ మీటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలి డిమాండ్ చేశారు. ఆగిపోయిన ఉద్యోగోన్నతులను వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. నిరసనలో కోశాధికారి టి.ఎం. బాషా, ఉపాధ్యక్షులు ఎం. ప్రభాకర్, అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, మూర్తి, రామచంద్ర, రెడ్డి, కెవిఎస్ సారధి, మున్నా, సిఎస్ రెడ్డి, ఎల్.ఎన్ రావు, లక్ష్మి రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు

'పాడా' పనులపై విజి 'లెన్స్'




- ఐదేళ్లలోని 6,300 పనులపై ఆరా
- నాలుగు బృందాలుగా రికార్డుల పరిశీలన
- పాడా అధికార యంత్రాంగంలో గుబులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పులివెందుల అథారిటీ డెవలప్ మెంట్ ఏజెన్సీ (పాడా) కింద చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది. విజయవాడ నుంచి వచ్చిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నాలుగు బృం దాలుగా విడిపోయి తనిఖీలను వేగవంతం చేసింది. రెండ్రోజులుగా పాడా కింద వైసిపి హయాంలోని ఐదేళ్లలో చేపట్టిన 6,300 పనుల వివరాలను విభాగాల వారీగా ఆరాతీస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికార యంత్రాంగాలు వైసిపి హయాంలో నీరు-చెట్టు పనులపై విజిలెన్స్ వేయగా, తాజాగా కూటమి సర్కారు పాడా పనులపై విజిలెన్స్ వేయడం ఏమిటని విస్తూపోతుండడం గమనార్హం.

వైసిపి హయాంలో పులివెందుల డెవలప్మెంట్ అథారిటీ (పాడా) పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై శూలశోధన మొదలైంది. వైసిపి హయాంలో పాడా కింద పలు డిపా ర్టుమెంట్లు రూ.వందల కోట్లతో సుమారు 6,300 పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. పంచా యతీరాజ్ డిపార్టుమెంట్ 2,400 పనులు, మున్సిపాలిటీ 1,000, పబ్లిక్హెల్త్ విభాగం 500, ఆర్అండ్బి 500, నీటిపారు దలశాఖ సుమారు 1,000, ఎపి ట్రాన్స్కో 254, మిగిలిన వాటిని ఇతర విభాగాలు చేపట్టారు. కొన్ని పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ అధికారుల బృందాలు క్షేత్ర స్థాయిలో పనుల వారీగా పరిశీలన చేసి నివేదికను అందించాలనే ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఎపి ట్రాన్స్కో ఇంజినీరింగ్ అధికార యంత్రాంగం లైనింగ్ టవర్ల ఏర్పాటు పనుల్లో నాసిరకం సామగ్రిని వినియోగించినట్లు ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం పులివెందుల మున్సిపాలిటీ కింద చేపట్టిన కొన్ని పనులకు రూ.38 కోట్లు చెల్లింపులు చేసింది. ఇది నియో జకవర్గ టిడిపి నాయకులకు కంటగింపునకు కారణమైనట్లు తెలుస్తోంది. కూటమి సర్కారు ఏర్పడిన వెంటనే పాడా కింద చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ ఆడిట్ చేయించింది. సుమారు వారం రోజులపాటు రాష్ట్ర ఆడిట్ బృందాలు ఆడిట్ చేసిన సంగతి తెలిసిందే. ఎటువంటి అవకతవకలు లేనట్లు తేలినట్లు సమాచారం. ఆడిట్ అనంతరం ఆర్నెళ్లు తిరిగేలోపు మరోసారి విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది.

2014-19 పీరియడ్లో టిడిపి కేడర్ చేపట్టిన నీరు-చెట్టు పనులపై వైసిపి సర్కారు విజిలెన్స్ వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మంది ఇంజినీర్ల జీవితాలతో విజిలెన్స్ తనిఖీల పేరుతో ఆడుకుంది. జిల్లాలో 12 నుంచి 16 మంది ఇంజినీర్లు విజిలెన్స్ తనిఖీలను ఎదుర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చీ రావడంతోనే కేబినెట్ తీర్మానం పేరుతో నీరు-చెట్టు పనులు చూసిన ఇంజినీరింగ్ అధికారులకు ఉపశమనం కలిగించింది. వైసిపి చేసిన తరహాలోనే కూటమి సర్కారు పులివెందుల అథారిటీ డెవలప్మెంట్ (పాడా) కింద చేపట్టిన అభివృద్ధి పనులపై విజిలెన్స్కు ఆదేశించడం ఏమిటని అధికార యంత్రా ంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వైసిపి హయాంలో కేడర్ చేపట్టిన పనులపై, వైసిపి అధికారం లోకి వస్తే టిడిపి కేడర్ చేపట్టిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ తని ఖీల పేరుతో అధికారుల జీవితాలతో చెలగాటమాడడం ఏమిటనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నిర్మాణంలో ఉన్న నగరవనం పనులు

వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఎల్.కాంతారావు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతున్న గండికోట పర్యాటక కేంద్రం మన భౌగోళిక వారసత్వ సంపద అని.. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు పేర్కొన్నారు. గురువారం గండికోట పర్యాటక క్షేత్రంలోని అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ మీటింగ్ హాలులో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భౌగోళిక కార్యకలాపాలు' అనే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎడిజి (సౌత్ రీజన్) ఎస్డి. పట్భజే, ఎపి టూరిజం ప్రాజెక్ట్స్ ఇడి ఎం. శేషగిరి, రాష్ట్ర భూగర్భ గనుల శాఖ ఎడి డబ్ల్యు.బి. చంద్రశేఖర్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎడిజి జాన్విజ్ శర్మ, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ జెడిజి అరుణ్ శ్రీవాత్సవ, జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (క్యూరేటరల్) డిప్యూటీ డిజి స్నిగ్ధా ఘటక్లతో పాటు.రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, జెసి అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి మాట్లాడుతూ గండికోట గార్జ్కు ప్రపంచ స్థాయిలో యునెస్కో గుర్తింపు ఆమోదం కోసం కేంద్ర జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు ప్రతినిధులుగా హాజరై ఇక్కడి వనరులు, భౌగోళిక స్థితిగతులు, సంస్కృతిక పరిస్థితులను పరిశీలించారని చెప్పారు. యునెస్కో వారు సూచించిన ప్రమాణికాల ఆధారంగా నివేదికలను తయారు చేస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన గండికోట సమాచార ప్యానెల్ బోర్డును ఆవిష్కరించిన అనంతరం గండికోట గార్జ్ పరిసర ప్రాంతాలు, గండికోట పోర్టులోని వివిధ సందర్శనీయ ప్రదేశాలను జియోలజికల్, ఆర్కియాలజికల్, టూరిజమ్ శాఖ అధికారులతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డిఒ సాయిశ్రీ, జమ్మలమడుగు తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, సంబధిత శాఖల అధికారులు, కన్సల్టెంట్స్ పాల్గొన్నారు.



గండికోటలో పర్యటిస్తున్న అధికారులు

ఊరి బడి ఉసురు తీయొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాల యాజమాన్య కమిటీల (ఎస్ఎంసి) బలవంతపు తీర్మాణాలతో ఊరి బడి ఉసురు తీయొద్దని యుటిఎఫ్ నాయకులు కోరారు. గురువారం డిఇఒ ఎస్.షంషుద్దీన్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో 117ను ప్రవేశపెట్టి, ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులను విలీనం చేయడం ద్వారా ప్రాథమిక విద్యా రంగాన్ని చిన్నాభిన్నం చేసిందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే జీవో 117 ను రద్దుచేసి, ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిపక్షంలో ఉన్న నారాలోకేష్ హామీలు ఇచ్చారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోగా, ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పైగా ప్రైమరీ మోడల్ స్కూల్స్ను ఏర్పాటు చేసే సాకుతో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేస్తూ ఊరి బడి ఉసురు తీస్తున్నారని విమర్శించారు. విలీన విద్య పేరుతో పేదలకు విద్యను దూరం చేసే చర్యలను ప్రభుత్వం విడనాడకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్, సి.డి.పి.ప్రత్యూష, వీరనారాయణ పాల్గొన్నారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం విడనాడాలి

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలోని ఎవిఆర్, లిటిల్ఫ్లవర్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల విద్యాశాఖ అధికారి రఘునాథ్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని మాట్లాడుతూ ఇటీవల ఎవిఆర్, లిటిల్ ఫ్లవర్ పాఠశాలల్లో విద్యార్థినిలపైన అసభ్యకరంగా, లైంగికంగా వేధించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని వారిపైన ఫోక్సో యాక్ట్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సభ్య సమాజం, ఉపాధ్యాయ లోకం తలదించుకునేలా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపైన సెక్షన్లు తగ్గించి మామూలు కేసులు పెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. పాఠశాలలకు ఆడపిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా కలెక్టర్ ప్రవేట్ పాఠశాలలపై నిఘా ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్షణ కల్పించా లన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె మస్తాన్, షరీఫ్ పాల్గొన్నారు.

యునెస్కో గుర్తింపు కోసం కృషి చేస్తాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని గండికోటకు యునెస్కో గుర్తింపు సాధించేందుకు తమ వంతు కృషి తప్పక చేస్తామని భారత పురావస్తు సర్వేక్షణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జాన్విజ్శర్మ అన్నారు. ఆ శాఖ కన్జర్వేషన్ డైరెక్టర్ ఎ. బీమా, సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ గోపీనాథ్ బృందం గురువారం గండికోట సర్వే కోసం వెళుతూ కడప నగరంలో ఆగారు. ఈ సందర్భంగా ఇన్టాక్ చాప్టర్ కన్వీనర్, జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోటకు యునెస్కో గుర్తింపు దక్కేలా చూడాలని, సిద్ధపటం కోట, తొలిమలి తెలుగు శాసనాలకు, చింతకుంట చిత్రాలకు రక్షణ కల్పించాలని ఆర్కియాలజీ అధికారులకు విన్నవించారు. సంస్థ ప్రచురించిన పర్యాటక వారసత్వ ప్రాంతాల పుస్తకాలు, బ్రోచర్లు, మన చరిత పత్రికలను వారికి అందజేశారు. సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, భారవి, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, సంజీవరెడ్డి, శివ శంకర్ రెడ్డి, కొండారెడ్డి వారికి పుష్పగిరి శిల్ప సంపద కు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం కేంద్ర పురావస్తు శాఖ అధికారులను ఘనంగా సత్కరించి జిల్లా పర్యాటకం వారసత్వంపై ప్రచురించిన పుస్తకాలను అందజేశారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం తెలిపారు. గురువారం కడప జిల్లా ప్రొద్దుటూరులో అమృతనగర్ కాలనీలో మహిళలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మళ్ళీ గ్యాస్ ధరలు పెంచి ప్రజల తలమీద బండరాయి వేసినట్లు అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద మండి పడుతున్నా, ప్రజల నిరసన చేస్తున్నా పట్టించుకోకసోవడం దారుణమన్నారు. ఒకేసారి రూ.50 పెంచితే పేద ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో విజయ, సల్మా, రెస్మా, జయమ్మ, కొండమ్మ, శ్యామల, ఇమంబీ, మాబుచన్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు:** గ్యాస్ ధరలు తగ్గిం చాలని కోరుతూ స్థానిక రాజీవ్ సర్కిల్లో గురువారం గ్యాస్ సిలిండర్లతో ఆందో ళన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ ధరలను తగ్గించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్య క్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు బాబు పకీరయ్య శేఖర్, చెన్నారెడ్డి మురళి శారద శీను పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** వాయుబండ కాదు సామాన్యుని నెత్తిపై గుది బండ అని వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించు కోవా లని సిపిఎం నాయకులు జి.ఏసుదాసు డిమాండ్ చేశారు. కేంద్రం తక్షణమే గ్యాస్ పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు వినయ్ కుమార్, మధు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న మహిళలు

ఛార్జీల పేరుతో పేదలపై రోజుకో బాదుడు : వైసిపి

ప్రజాశక్తి - కడప : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక రోజుకో ఛార్జీలు పెంచుతూ పేదల నడ్డి విరచడమే పనిగా పెట్టుకున్నాయని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు అమాంతంగా పెంచిందని విమర్శించారు. ధరలు పెంచడం వల్ల అన్ని నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలపై మోయలేనంత భారం పడుతుందన్నారు. ఈ ప్రభుత్వాలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటీ అమలు కాలేదు అన్నారు. ప్రజలకు చెప్పేది ఒకట చేసేది ఒకటి అని చెప్పారు. జన్మభూమి పేరును మారుస్తూ పి4 అంటూ కొత్త కార్యక్ర మంతో ముందుకు వస్తున్నారు అన్నారు. ప్రజలకు ఇచిన ప్రతి హామీని నెరవే ర్చాలి అని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు బిహెచ్ ఇలియాస్, పులి సునీల్ కుమార్, శ్రీను, త్యాగరాజు, షఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రనాథ్రెడ్డి

ప్రవేశ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి-కాశినాయన : ఎపి మోడల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20 నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు ప్రిన్సిపల్ సౌజన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20న ఈస్టర్ పండుగ ఉన్నందున ఈనెల 21కు వాయిదా వేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గమనించి సోమవారం ఉదయం 10 గంటలకు పరీక్షకు హాజరు కావాలన్నారు. పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు ఆన్లైన్లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. అమలు శూన్యం

విచ్చలవిడిగా వినియోగం - నిషేధాజ్ఞలు బేఖాతర్ - కనిపించని క్లాత్ సంచులు - నిబంధనలు కఠినం చేయాలంటున్న పర్యావరణ నిపుణులు



రహదారి వెంబడి కుప్పలుగా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం' అంటూ అధికారులు చెబుతున్న గొప్పలు ఏ మాత్రం అమలుకునోచుకోవడం లేదు. ఖాజీపేటలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వ నిబంధనలను దుకాణదారులు అతిక్రమిస్తూ ప్లాస్టిక్ కవర్లను ఇష్టానుసారం విక్రయిస్తున్నారు. పంచాయతీ అధికారులు దుకాణాలపై అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తున్నారేతప్ప.. ఎక్కడా కఠినమైన నిబంధనలను అమలు చేయలేకున్నారు. దుకాణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా వారికి కొమ్ము కాస్తున్నారన్న అభియోగాలు ప్రజల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ దుకాణాలు, నిత్యవసర వస్తువుల దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్‌ను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నా వారిపై ఎలాంటి చర్యలు లేవు. పర్యావరణ హాని కలిగే ప్లాస్టిక్ పదార్థాలను ప్రభుత్వం నిషేధించింది. అయినా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. పర్యావరణ కాలుష్యం వల్ల అనారోగ్య సమస్యలు, భూమి, నీరు, వాతావరణం కలుషితం పెద్ద ఎత్తున జరుగుతోంది. ఓ వైపు ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నంగా ఉంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ అమ్మకాలపై దృష్టి సారించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణవేత్తలు, ప్రజలు కోరుతున్నారు.

పులివెందుల టౌన్ : రూ.10బజ్జీలు కొన్నా సరే ఒక ప్లాస్టిక్ కవర్ ఇస్తున్నారు. చివరికి ఒక కట్ట కొత్తిమీర తీసుకున్నా ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి ఇస్తున్నారు. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు మన ఇంట్లో ప్లాస్టిక్ కవర్లు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మానవ మనుగడకు పెను ప్రమాదకారి అయిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలనేది నినాదాలకే అధికారులు పరిమితమవుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించకపోవడంతో పులివెందుల మున్సిపాలిటీలో ఏ దుకాణం వద్ద చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను, ప్లాస్టిక్ కప్పుల్లో టీ, కాఫీలను తీసుకోవడం ద్వారా శ్వాసకోశ, కేన్సర్ వంటి ప్రాణాంతక రోగాలను తెచ్చుకుంటున్నారు. గత ఏడాది జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్ సంచులకే ప్రభుత్వం అనుమతులిచ్చింది. అంతకన్నా తక్కువ మందం ఉన్న సంచుల క్రయవిక్రయాలపై భారీ జరిమానాలు విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించింది. ఆ మేరకు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అధికారులు దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్నారు. జరిమానాలు విధిస్తున్నారు. అయినా ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గలేదు. పర్యావరణానికి అత్యంత హాని కలిగించేది ప్లాస్టిక్. గ్రామాల్లో ఏ రోడ్డు చూసినా.. ఎక్కడ చూసినా, ఏ ఇంట్లో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనిమిస్తున్నాయి. కిరాణా దుకాణాలు, టీ కొట్లు, హోటళ్లు, బడ్డీ కొట్లు, కూరగాయల దుకాణాలు ఇలా ప్రతి వ్యాపారంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు ఆపై పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం షరా మామూలే అవుతోంది.

మూన్నాళ్ల ముచ్చటగానే..

ప్లాస్టిక్ నిషేధం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. మూడు నెలలు తిరిగే సరికి మళ్లీ షరా మామూలే అంటూ ప్రతి షాపులోనూ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలు నీరుగారిపోతున్నాయి. ఫలితంగా కాలువలు, చెత్తకుప్పల్లో పాలిథిన్ కవర్లు పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలను మూగజీవాలు తిని కడుపులో జీర్ణంకాక మృత్యువాత పడుతున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం యావత్ మానవాళికి ప్రమాదకరంగా మారి పెద్ద ప్రళయాన్నే సృష్టిస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరి స్తున్నారు. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకొస్తున్నా, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో అధికా రులు విఫలం కావడం వారి బాధ్యతా రాహిత్యాన్ని తెలియ జేస్తోంది. బాధ్యతతో నిబంధనలు పాటించా ల్సిన ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇకనైనా అందరూ కలిసికట్టుగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విడిచి పెట్టి, క్లాత్ సంచులు వినియోగిస్తూ ఆరోగ్యవం తమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

ప్లాస్టిక్ వదిలితేనే ఆరోగ్యం..

ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా విషవాయువులు శరీరంలోకి చేరుతాయి. ఫలితంగా గ్యాస్ట్రిక్, శ్వాసకోశ సమస్యలతోపాటు కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న ఆవులు, బర్రెలు చనిపోవడం చూస్తూనే ఉన్నాం. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వదిలేస్తేనే ఆరోగ్యానికి మంచిది. **- డాక్టర్ సుకన్య, ప్రభుత్వ వైద్యురాలు పులివెందుల**

ప్రజలు సహకరించాలి..

పులివెందుల మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. ఇటీవలే సిబ్బంది పట్టణంలో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. ఇంకా అక్కడక్కడా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని తెలుస్తోంది. అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల అమలులో భాగంగా ప్రజలు సైతం స్వచ్ఛందంగా ప్లాస్టిక్ రహిత సంచులు వినియోగిస్తూ సహకరించాలి. **- రాముడు, మున్సిపల్ కమిషనర్, పులివెందుల**



పులివెందుల టౌన్ : ప్లాస్టిక్ కవర్లతో సరుకులు తీసుకెళుతున్న మహిళ



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ప్రిన్సిపల్‌పై చర్యలకు జాప్యమేల..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొండాపురం మండలం పునరావాస కాలనీ చౌటుపల్లె అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై ఆరోపణలు, కేసులు నమోదైనా చర్యలకు జాప్యమెందుకని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది కాలంలో కొండాపురం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ భర్త అక్కడి సిబ్బందిపై లైంగిక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నిజ నిర్ధారణలో వాస్తవమని తెలిసి ప్రిన్సిపల్, ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ విషయం పత్రికల్లో కూడా వచ్చిందన్నారు. కేసు నమోదైన వ్యక్తిని ఇంకా ఆ గురుకుల పాఠశాలలో కొనసాగించడం దేనికి నిదర్శనమన్నారు. ప్రజల్లో అనేక అనుమానాలకు కూడా తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికీ ప్రిన్సిపల్ భర్త గురుకుల పాఠశాల క్వార్టర్స్‌లో విద్యార్థినుల కలిగిన హాస్టల్‌లో కొనసాగించడం దారుణమన్నారు. గతంలో ఆ గురుకుల పాఠశాలలో పాముకాటు సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు. వరుస ఆరోపణలు, సంఘటనలు జరుగుతున్నా జిల్లా అధికారులు ఆమెపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారని పేర్కొన్నారు. కనీసం ఆ పాఠశాల నుండి కూడా తప్పించకుండా కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు కొండాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకొని పాఠశాల నుంచి తక్షణమే తప్పించాలని, లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని శివకుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

పి.రవికుమార్‌కు జాతీయ ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె



మండలంలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో పనిచేస్తున్న పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సౌత్ రన్ ప్రయివేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పినాగయ్య తెలిపారు. జమ్మల మడుగు పట్టణానికి చెందిన డాక్టర్ పెనుగొండ రవికుమార్ 12ఏళ్లుగా ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, పరిపాలన అధికారిగా అంకితభావంతో క్రియాశీలకంగా పనిచేస్తూ అభివృద్ధికి పాటుప డుతున్నారు. అంతర్జాతీయ ప్రతిష్టాత్మకమైన జపాన్‌లోని ఎఐజెడ్ యూని వర్సిటీలో పరిశోధనలు చేసి సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగంలో విశేష మైన కృషి చేసినందుకు, ఆయన చేసిన విలువైన సేవలను గౌరవిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డుకు డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారం రవి కుమార్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ అభినందించారు.

కష్ట కాలంలో పనిచేసిన వారికే పట్టం కట్టాలి

- సిఎం చంద్రబాబుతో డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కష్ట కాలంలో పనిచేసిన వారికే నామినేటెడ్ పదవులు దక్కాలని డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి కోరారు. ఆ మేరకు ఎపి రాష్ట్ర సచివా లయంలో ప్రవీణ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇవ్వబోయే నామినేటెడ్ పదవుల్లో ఆఖరులో పార్టీ మారినవారికి కాకుండా కష్టకాలంలో నాలుగేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన వారికే స్థానం కల్పించాలని కోరారు. వైసిపి పాలనలో ప్రొద్దుటూరులో టిడిపి కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులు, రౌడీషీటర్లను తొలగించాలన్నారు. ప్రొద్దుటూరు మార్కెట్ నిర్మాణానికి మున్సిపాలిటీలో నిధుల కొరత కారణంగా నిలిచిన పనులకు ప్రభుత్వమే నిధులు ఇచ్చి పూర్తి చేయాలన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిట్ వేసి విచారణ జరిపించాలన్నారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



కేక్ కట్ చేయిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎంపీ పుట్టా మహేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గం శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను గురువారం టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల నాయకులు నెల్లూరప్ప యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి, భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాల చిన్నారులచే కేక్ కట్ చేయించి, మిఠాయిలను పంచిపెట్టారు. టిడిపి నాయకులు నాగపట్నం రామసుబ్బయ్య, పూసల కొట్టాలు గోవింద్ సుబ్బ య్య, ఐ టిడిపి మండలం అధ్యక్షులు పాపాన మల్లికార్జునరెడ్డి, బిసి సంఘం నాయకులు తవ్వారుపల్లె వీరయ్య, రమేష్ నాయుడు, బొర్రా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టులో నీరున్నా తడవని ఆయకట్టు

ప్రజాశక్తి - చాపాడు

తెలుగుగంగ ప్రాజెక్టుకులో నీరు ఉన్నా ఆయకట్టు తడవడంలేదని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలో గురువారం ఆయన ఆయకట్టు రైతులతో కలిసి మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్టులో ప్రతి ఏడాది నీరు ఉంటున్నా, పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతు పొలానికి నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్ట్ అయిన తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఆర్-1,2, బ్రహ్మం సాగర్‌కు 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నీరు విడుదల చేశారన్నారు. అప్పటినుండి ప్రతి సంవత్సరం ప్రాజెక్టుకు నీరు వస్తున్నా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ 20 ఏళ్లల్లో ఏ సంవత్సరం కూడా నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయలేదన్నారు. ఆయకట్టు రైతుల అనైక్యతకు అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో కొద్దిమంది రైతులు తమ పొలాల్లోని పంట, పిల్ల కాలవలను పూడ్చి, పైరు పెట్టుకుంటూ ఉండడంతో ప్రాజెక్టు కేవలం డ్యాములకే పరిమితమైందన్నారు. భవిష్యత్తులో ప్రతి రైతుకు నీరందేలా పాలకులు, అధికారులు ప్రయత్నం చేయాలని, లేకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, బాల నరసింహారెడ్డి, రాజా, పోలయ్య పాల్గొన్నారు.

బండిలాగుతూ ఎద్దు మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామం వద్ద గురువారం సాయంత్రం వడ్ల మూటలు ఉన్న బండిని లాగుతూ ఒక్కసారిగా ఎద్దు కుప్పకూలి మృతి చెందింది. వడ్లు (ధాన్యం) మిషన్‌కు తీసుకెళుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. జి.అంకన్న అనే రైతుకు చెందిన ఎద్దుల బండిపై వడ్లమూటలను తీసుకొని మిషన్‌కు బయలుదేరాడు. గ్రామం నుంచి కొంత దూరం వెళ్లగానే వంక సమీపంలో ఎద్దు ఒక్కసారిగా కుప్పకూలి కింద పడింది. వెంటనే పశువైద్య సిబ్బంది వెంకటేశ్వర్లుకు సమాచారమిచ్చారు. ఆయన ఎద్దును పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించాడు. మండల పశువైద్యాధికారి మహమ్మద్ గౌస్‌కు విషయం తెలిపారు. రైతు నుంచి వివరాలు సేకరించి ఆయనకు తగు న్యాయం చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎద్దు రూ.60 వేలకు కొనుగోలు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని అంకన్న కోరుతున్నాడు.

ఆర్‌టిసి ఉద్యోగులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆర్‌టిసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఎన్ఎంయు నాయకులు ఉద్యోగులు గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ నాయకులు వైఆర్‌కె రెడ్డి, నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండు రోజులు ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. ఉద్యోగుల ఉద్యోగ భద్రత 1/2019 సర్కులర్‌ను అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవర్స్ ఆపాలన్నారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. తీవ్ర అనారోగ్య కారణాలతో బాధపడే ఉద్యోగులకు ఒడిలను కేటాయించాలని కోరారు. ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిపో సెక్రటరీ భానుప్రసాద్ గ్యారేజి సెక్రటరీ అశోక్‌కుమార్, జోనల్, డిపో నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

క్రైం కార్నర్

స్కూటీని ఢీకొట్టి చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని నక్కలపల్లి సమీపంలో ఆశ వర్కర్ స్కూటీని ఓ యువకుడు ఢీకొట్టి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బలపనూరు ఆశ వర్కర్ వంగల సుజ్ఞాష్ణ విధులకు వెళుతుండగా మెయిన్ రోడ్ నుంచి నక్కలపల్లికు వెళ్లే దారిలో పాత హీరో హెూండా బైక్‌లో వచ్చిన ఓ యువకుడు హెల్మెట్ ధరించి ఆశ వర్కర్ స్కూటీకి డాష్ ఇచ్చాడు. స్కూటీ అదుపుతప్పిన వెంటనే కత్తితో బెదిరించి ఆమె మెడలోని 32 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. దీని విలువ దాదాపు రూ.1.5లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితురాలి కథనం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ సూచించారు. గురువారం చాపాడు-2 అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజులపాటు గర్భిణులు పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తహీనత లేకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, రోజమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వేముల : స్థానిక పేర్నపాడు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హసీనా మాట్లాడుతూ పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల పోషకాహార లోపాలను తగ్గించేందుకు, వారి ఆరోగ్యాలను మెరుగుపరచడానికి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులపై దృష్టి సారిస్తారని తెలిపారు. ఇది పిల్లల అభివృద్ధికి కీలకమైన కాలమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ సునీత

చక్రాయపేట : గర్భధారణ మొదలు బిడ్డకు రెండేళ్ల వయసు వరకు వెయ్యి రోజుల సమయం అత్యంత ముఖ్యమైందని సిడిపిఒ వి.సునీత పేర్కొన్నారు. చక్రాయపేట-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార పక్షోత్సవాలను నిర్వ హిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ బిడ్డ వెయ్యి రోజుల కాల వ్యవధిలో పాప మెదడు 80 శాతం అభివృద్ధి చెందు తుందన్నారు. ఆరోగ్యక రమైన అలవాట్లు, మంచి వాతావరణం ఉండేలా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని, గర్భం ధరించిన తర్వాత పోషకాహారం తీసు కోవాలన్నారు. 6 నెలల వరకు కేవలం తల్లిపాలు, ఆ తర్వాత అనుబంధ ఆహారం అందిం చాలన్నారు. వయసు, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను వైద్యులచే పరీక్షిం చుకోవాలన్నారు. లోప పోషణ నుండి విముక్తి కల్పించేందుకు అంగన్వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తల్లులకు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభు త్వం రూపొందిన పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారులే స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగసుభాషిని, అంగన్వాడీ కార్యకర్తలు ప్రశాంతి, ముంతాజ్, నాగేశ్వరి, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత ప్రభుత్వ హయాంలో పులివెందుల డెవలప్మెంట్ అథారిటీ(పాడా) ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా భానుకోటలో దాదాపు రూ.ఐదు లక్షలు వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంకును విజయవాడకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఇ యోగేష్‌బాబు బృంద సభ్యులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంబుక్, ఇతర రికార్డుల ఆధారంగా పరిశీలించారు.

అధికారుల్లో గుబులు..

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో పాడా ఆధ్వర్యంలో రూ.కోట్లాది అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయననే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులనుతనిఖీలకు ప్రభుత్వం ఆదేశించింది. కొంతమంది అధికారులు చేసిన పనులలో నాణ్యత లోపించడంతోపాటు, కొన్నిచోట్ల పనులు చేయకుండానే బిల్లులు చేసిన అధికారుల్లో గుబులు పుడుతున్నట్లు తెలుస్తోంది.

పులివెందుల రూరల్ : పులివెందులలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాడా ద్వారా జరిగిన రూ.1200 కోట్లతో 254 పనులు జరిగాయి. పులివెందుల మున్సిపాలికి సంబంధించి 53 పనులు చేశారు. ఇందులో క్రికెట్ స్టేడియం, సెంట్రల్ బోలెవార్డ్, మినీ సెక్రటరియేట్, రింగ్ రోడ్ సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్, ఉలిమెల్ల లేక్ వ్యూ, సిసి రోడ్లు, తారు రోడ్లు వంటి పనులు జరిగాయి. దీనికి సంబంధించి ప్రస్తుతానికి పులివెందుల మున్సిపాలిటీలో నాలుగు టీంలుగా విజిలెన్స్ అధికారులు పనులను పరిశీలిస్తున్నారు. సిసి రోడ్లకు సంబంధించి విజిలెన్స్ అధికారి డిఇ యోగేష్ బాబు ఆధ్వర్యంలో సిసి రోడ్ల నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఇతర విజిలెన్స్ అధికారులు సివిఆర్ డ్యాం, ఇరిగేషన్ పనులకు సంబంధించి, ఆర్‌డబ్ల్యుఎస్ రూరల్ పనులు పరిశీలిస్తున్నారు.



పులివెందులలో సిసి రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్యం చేరని రేషన్ పంపిణీ

- దుకాణాల చుట్టూ తిరుగుతున్న కార్డుదారులు
- బఫర్ పేరుతో రేషన్ బియ్యం సరఫరాలోనే కోత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రేషన్ దుకాణాల్లో బియ్యం కొరత కారణంగా కార్డుదారులకు అరకొరగానే రేషన్ పంపిణీ చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 32 రేషన్ దుకాణాలు ఉండగా.. ఇందులో 9,534 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతినెల 28,350 కిలోల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఈనెల రేషన్ బియ్యం సరఫరాలో బఫర్ పేరుతో కోత విధించినట్లు దుకాణదారులు చెబుతున్నారు. బఫర్ పేరుతో కేవలం 60 నుంచి 70 శాతం మాత్రమే ఆయా రేషన్ దుకాణాలకు సరఫరా చేశారు. 10వ తేదీ దాటినా అరకొరగానే రేషన్ పంపణీ చేసినట్లు రేషన్ కార్డుదారులు వాపోతున్నారు. ఒకటో తేదీ నుంచి రెండుమూడు రోజులపాటు మాత్రమే పంపిణీ చేసి రేషన్ డీలర్లు తమ రేషన్ దుకాణాలను మూసి వేసినట్లు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం కోసం అనేకసార్లు దుకాణాల వద్దకు వెళ్లినా మూసి వేయడం పట్ల కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకొని కార్డుదారులందరికీ బియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బఫర్ పేరుతో కోత ఎందుకు..

బఫర్ పేరుతో రేషన్ బియ్యంలో ఎందుకు కోత విధిస్తున్నారంటూ కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదవాడికి మూడు పూటలా అన్నం తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆదేశించిన క్షేత్రస్థాయిలోని అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం చౌక దుకాణ పరిధిలో డీలర్లు గత మూడు నెలల కాలవ్యవధిలో రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసిన బియ్యం ఆధారంగా బఫర్ చేసి 60 నుంచి 70 శాతం బియ్యాన్ని మాత్రమే సరఫరా చేశారు. ఈ కారణంగా 100 క్వింటాలు సరఫరా కావలసిన రేషన్ దుకాణానికి కేవలం 60 నుంచి 70 క్వింటాలు మాత్రమే సరఫరా అయ్యాయి. కార్డుదారులకు సరిపడా బియ్యం రాకపోవడంతో డీలర్లు దుకాణాలను మూసి వేసినట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు..

మండలంలో రేషన్ కార్డుదారులందరికీ రేషన్ బియ్యం పంపిణీ చేయలేదనే విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై రేషన్ డీలర్లతో చర్చించాం. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-నాగేశ్వరరావు, తహశీల్దార్, సింహాద్రిపురం



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్లు(ఫైల్‌ఫొటో)